RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 353 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | మంగళవారం, 25 జూన్ 2024 | పేజీలు : 4 | వెల : 2/-




# ప్రక్షాళన

## తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ.. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలి

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం అధికార వర్గాల్లో భారీ ప్రక్షాళనకు పూనుకుంది. భారీగా ఐఏఎస్‌ల బదిలీలు జరిగాయి. 44 మంది ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జీఏడీ ముఖ్య కార్యదర్శిగా సుదర్శన్‌రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలిని నియమించింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. పశుసంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శిగా సవ్యసాచి ఘోష్, కార్మిక ఉపాధి శిక్షణ శాఖ ముఖ్య కార్యదర్శిగా సంజయ్ కుమార్, యువజన సర్వీసులు, పర్యాటక, క్రీడల శాఖ ముఖ్య కార్యదర్శిగా వాణీప్రసాద్‌ను ప్రభుత్వం నియమిం చింది. చేనేత, హస్తకళల ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్‌ను నియమించడంతో పాటు.. హ్యాండ్లూమ్స్, టీజీసీవో హ్యాండ్‌క్రాఫ్ట్స్ ఎండీగా ఆమెకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శిగా సందీప్ సుల్తానియాను నియమించారు. ఆయనకు ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శిగానూ అదనపు బాధ్యతలు అప్పగించారు. అటవీ, పర్యావరణ శాఖల ముఖ్య కార్యదర్శిగా అహ్మద్ నదీమ్‌ను నియమించడంతో పాటు టీపీటీఆర్ఐ డీజీగా ఆయనకు అదనపు బాధ్యతలు ఇచ్చారు.

**ఐఏఎస్‌లు.. వారు బదిలీ అయిన స్థానాలివే!**

సబ్యసాచి ఘోష్(ఐఏఎస్) – పశుసంవర్ధక, పాడి అభివృద్ధి, మత్స్య విభాగం ముఖ్య కార్యదర్శి, సంజయ్ కుమార్(ఐఏఎస్) – కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు విభాగం ముఖ్య కార్యదర్శి, ఎ.వాణిప్రసాద్ (ఐఏఎస్) – యువజన, క్రీడలు, పర్యాటక విభాగం ముఖ్య కార్యదర్శి, శైలజ రామయ్యర్ (ఐఏఎస్) – దేవాదాయ, పరిశ్రమలు, వాణిజ్యం, హ్యాండ్‌లూమ్స్, టెక్స్‌టైల్స్ విభాగం ముఖ్య కార్యదర్శి, అహ్మద్ నదీమ్ (ఐఏఎస్) – అటవీ, పర్యావరణం, శాస్త్ర సాంకేతిక ముఖ్య కార్యదర్శి, సందీప్ కుమార్ సుల్తానియా (ఐఏఎస్) – ఆర్థిక విభాగం ముఖ్య కార్యదర్శి, సయ్యద్ అలీ ముర్తాజా రిజ్వి (ఐఏఎస్) – వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ విభాగం ముఖ్య కారదర్శి, సి. సుదర్శన్ రెడ్డి (ఐఏఎస్) – జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్, సేవలు మానవ వనరులు కార్యదర్శి, డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాశ్ (ఐఏఎస్) – రిజిస్ట్రేషన్, స్టాంప్స్, హౌసింగ్ కార్యదర్శి, కె. ఇలంబరిథి (ఐఏఎస్) – ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, రొనాల్డ్ రాస్ (ఐఏఎస్) – విద్యుత్ విభాగం కార్యదర్శి, దేవసేన (ఐఏఎస్) – కళాశాలలు, సాంకేతిక విద్య కమిషనర్, సర్ఫరాజ్ అహ్మద్ (ఐఏఎస్) – హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండీ) మెట్రోపాలిటన్ కమిషనర్, డి. దివ్య (ఐఏఎస్) – గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ సీఈఓ, ఆమ్రపాలి (ఐఏఎస్) – జీహెచ్ఎంసీ కమిషనర్, హరిచందన దాసరి (ఐఏఎస్) – రహదారులు, భవనాలు ప్రత్యేక కార్యదర్శి, అలగు వర్షిణి (ఐఏఎస్) – సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి, వి.పి. గౌతమ్ (ఐఏఎస్) – గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి, ఎస్. కృష్ణ ఆదిత్య (ఐఏఎస్) – ఉపాధి, శిక్షణ డైరెక్టర్, కె. అశోక్ రెడ్డి (ఐఏఎస్) – హైదరాబాద్ మెట్రో నీటి సరఫరా పారిశుద్ధ్య నిర్వహణ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్, అనురాగ్ జయంతి (ఐఏఎస్) – జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్, భవేశ్ మిశ్రా (ఐఏఎస్) – ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ డిప్యూటీ కార్యదర్శి, జి. రవి (ఐఏఎస్) – తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ, కె. నిఖిల (ఐఏఎస్) – తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థ సీఈఓ, ఎస్‌కే. యాస్మిన్ బాషా (ఐఏఎస్) – ఉద్యానవన, సెరికల్చర్ డైరెక్టర్, ఎస్. వెంకట్రావ్ (ఐఏఎస్) – ప్రొటోకాల్ డైరెక్టర్, పి. ఉదయ్ కుమార్ (ఐఏఎస్) – వ్యవసాయ సహకార విభాగం సంయుక్త కార్యదర్శి, బి. గోపి (ఐఏఎస్) – పశుసంవర్ధక విభాగం డైరెక్టర్, ఆల. ప్రియాంక (ఐఏఎస్) – మత్స్య శాఖ డైరెక్టర్, త్రిపాఠి (ఐఏఎస్) – పర్యాటక శాఖ డైరెక్టర్, స్నేహ శబరీశ్ (ఐఏఎస్) – జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్, కాత్యాయని దేవీ (ఐఏఎస్) – ఫైనాన్స్ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, ఇ.వి. నరసింహా రెడ్డి (ఐఏఎస్) – ప్రాథమిక విద్యా డైరెక్టర్, బి. హేమంత్ సహదేవరావ్ (ఐఏఎస్) – తెలంగాణ వైద్య సేవలు మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్, హేమంత కేశవ్ పాటిల్ (ఐఏఎస్) – జీహెచ్ఎంసీ ఎల్బీ నగర్ జోనల్ కమిషనర్, అపూర్వ చౌహాన్ (ఐఏఎస్) – జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్, అభిషేక్ అగస్త్య (ఐఏఎస్) – ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, బి. రాహుల్ (ఐఏఎస్) – భద్రాచలం పీఓ (ఐటీడీఏ), పి. గౌతమి (ఐఏఎస్) – మూసీ నదీ అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, సోని బాలాదేవి (ఐఎఫ్ఎస్) – తెలంగాణ క్రీడల ప్రాధికార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, ఎన్. ప్రకాశ్ రెడ్డి (ఐపీఎస్) – తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, ఎ.వి. రంగనాథ్ (ఐపీఎస్) – ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్, విపత్తు నిర్వహణ (జీహెచ్ఎంసీ) కమిషనర్, పి. ఉపేందర్ రెడ్డి (నాన్ క్యాడర్) – జీహెచ్ఎంసీ శేర్ లింగంపల్లి జోనల్ కమిషనర్, నిఖిల్ చక్రవర్తి (ఐఏ అండ్ ఏఎస్) – టీజీఐఐసీ (తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్.



## రక్షణ శాఖ భూములు కేటాయించాలి

ఢిల్లీ: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు ఢిల్లీ వెళ్లిన విషయం తెలిసిందే. ఢిల్లీలో సీఎం బిజీ బిజీగా ఉన్నారు. పలువురు కేంద్రమంత్రులను, ఏఐసీసీ అగ్రనేతలను ముఖ్యమంత్రి కలవనున్నారు. రాష్ట్ర సమస్యలను కేంద్రమంత్రుల దగ్గరికి సీఎం తీసుకెళ్లనున్నారు. ఇందులో భాగంగానే మధ్యాహ్నం కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌తో



సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ఎంపీలు భేటీ అయ్యారు. రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ఎంపీల భేటీ ముగిసింది.

డిఫెన్స్ భూములు, వరంగల్లో సైనిక్ స్కూల్ ఏర్పాటు ఇతర అంశాల గురించి రాజ్‌నాథ్ సింగ్‌కి విజ్ఞప్తి చేశారు. రక్షణ భూముల బదలాయింపుపై రాజ్‌నాథ్ సింగ్‌కు రేవంత్ విజ్ఞాపనలు ఇచ్చారు. హైదరాబాద్ నగరంలో రహదారులు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి రక్షణ శాఖ పరిధిలో ఉన్న భూములు కేటాయించాలని రాజ్‌నాథ్ సింగ్‌ను సీఎం కోరారు.

## కొండెక్కిన కూరగాయల ధరలు

హైదరాబాద్ : మార్కెట్ కూరగాయల ధరలు మండిపోతున్నాయి. వాటిని కొనాలంటేనే సామాన్యుడు హడలెత్తిపోతున్నాడు. నిన్నమొన్నటి వరకు కాస్త పరవాలేదు అనుకున్న ఉల్లి ధర కూడా ఇప్పుడు ఘాటెకింది. రిటైల్ మార్కెట్‌లో కేజీ ఉల్లి ధర రూ.40 నుంచి రూ.45 వరకు పలుకుతున్నది. మహారాష్ట్ర మార్కెట్ నుంచి దిగుమతులు తగ్గడమే ధర పెరుగుదలకు ప్రధాన కారణమని వ్యాపారులు తెలిపారు. తెలంగాణలోని మలక్‌పేట్, ఏపీలోని తాడేపల్లిగూడెం ఉల్లి మార్కెట్‌కు దేశవ్యాప్తంగా ఫేమస్. ఈ మార్కెట్‌లకు షోలాపూర్, నాసిక్, పుణె, అహ్మద్‌నగర్ ప్రాంతాల నుంచి నిత్యం కనీసం 450 టన్నుల వరకు ఉల్లి దిగుమతి అవుతుంది. ఇకడి నుంచి వివిధ ప్రాంతాలతోపాటు ఈశాన్య రాష్ట్రాల్లోని పలు మారెట్లకు తరలుతుంది. ఈ మారెట్‌కు ప్రస్తుతం రోజుకు 240 టన్నుల ఉల్లి మాత్రమే వస్తుండటం వల్ల వారంరోజులుగా ఉల్లి ధరల్లో మార్పులు వచ్చాయి.

వారం క్రితం రిటైల్ మార్కెట్‌లో కేజీ రూ.20 నుంచి రూ.30 వరకు పలికిన కేజీ ఉల్లి.. ఇప్పుడు రూ.50 నుంచి రూ.60కి చేరాయి. వారం క్రితం నాసి రకం ఉల్లి రూ.100కు మూడు కిలోలు విక్రయిస్తుండగా.. ప్రస్తుతం దుకాణాల వద్ద నాణ్యత తక్కువగా ఉన్న వాటిని కిలో రూ.40 నుంచి రూ.45 వరకు అమ్ముతున్నారు. పైగా త్వరలో బక్రీద్ పండగ ఉండటంతో డిమాండ్ అంతకంత పెరుగుతుంది. డిమాండ్, సరఫరా మధ్య అంతరం ఏర్పడటం వల్ల ధరలు పెరిగాయని మార్కెట్ ట్రేడర్లు చెప్పారు.

**ప్రతికూరగాయ ధర 10 పెరిగింది :** కూరగాయల ధరలు పెరుగుదలపై ఎర్రగడ్డ రైతు బజార్ ఈవో




రమేశ్ కీలక వ్యాఖ్యలు చేశారు. వర్షాకాలంలో కొత్త పంట వేయడంతో.. ఆ తేడా కూరగాయల ధరల్లో కనిపిస్తున్నదని తెలిపారు. ప్రతి కూరగాయలోనూ 10 రూపాయల పెరుగుదల కనిపిస్తున్నట్టు పేర్కొన్నారు. వివిధ జిల్లాల్లో రాష్ట్రాల నుంచి దిగుబడి తకువగా ఉండటంతో కూడా కూరగాయల ధరలు పెరిగాయని, ట్రాన్స్ పోర్ట్ ఖర్చులు కూడా పెరిగిపోవడంతో ఆ భారం కూడా కూరగాయల రేట్లపై పడిందని వెల్లడించారు. పెరిగిన ధరలు నెలరోజులపాటు కొనసాగే అవకాశం ఉన్నట్టు ఈవో చెప్పారు.

## సారు, కారు బేకారు.. ఎమ్మెల్యేలు పరారు !

హైదరాబాద్ : అందితే జుట్టు.. లేదంటే కాళ్లు.. ఈ సామెత పర్‌ఫెక్ట్‌గా సూటవుతుంది. మాజీ సీఎం, ప్రస్తుత బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు. ఎందుకీ మాట అనాల్సి వస్తుందంటే ఇప్పుడు ఆయన చేసే చర్యలు అలా ఉన్నాయి కాబట్టి మొన్న మొన్నటి వరకు.. అంటే అధికారం పోయేంత వరకు ఏ రోజైనా పార్టీ నేతలతో భేటీ అయ్యారా? కనీసం ఎమ్మెల్యేలతో అయినా మాట్లాడరా? లేదు. కానీ కాలం మహాచెడ్డది కదా.. ఎన్నికల ముందు వరకు వీనిలాకాశంలో విహరిస్తున్న కేసీఆర్‌ను తమ ఓటుతో నేలకు దించారు ప్రజలు. దీంతో ఇప్పుడు అందరూ కనిపిస్తున్నారు.. అందరితో ముచ్చటించేందుకు ప్రయత్నిస్తున్నారు.. కాని అస్సలు కుదరడం లేదంట. ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఏం నడుస్తోంది? ఇది ప్రశ్న.. ఎప్పుడూ ఖాళీ అవుతుందో అస్సలు సమజ్ అవ్వడం లేదు. ఇదీ సమాధానం.. ఎందుకంటే ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు నేరుగా కేసీఆర్ రంగంలోకి దిగినా పనులు కావడం లేదని ప్రస్తుతం ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసరాల్లో వినిపిస్తున్న టాక్. కొడితే ఏనుగు కుంభస్థలాన్నే కొట్టాలి అన్నట్టుగా కాంగ్రెస్ వ్యూహాలు కనిపిస్తున్నాయి. ఏకంగా బీఆర్ఎస్ కీలక నేత, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డికి కండువా కప్పేశారు సీఎం రేవంత్ రెడ్డి.. ఆ వెంటనే ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి జనారెడ్డితో భేటీ అయ్యారు. చూస్తుంటే ఉన్న 38 మంది ఎమ్మెల్యేల్లో ఓ 15 మంది వరకు జంప్ అయ్యే అవకాశం ఉందని తెలుస్తుంది. దీంతో సీన్‌లోకి కేటీఆర్.. ట్రబుల్ షూటర్‌గా పేరున్న హరీశ్‌రావు ఎంట్రీ ఇచ్చారు. కానీ పనవ్వడం లేదు.. ఎమ్మెల్యేలను కాపాడుకోలేని పరిస్థితి ఉన్నట్టు కనిపిస్తుంది. దీంతో ఆఖరిగా.. బ్రహ్మాస్త్రంగా కేసీఆరే నేరుగా రంగంలోకి దిగారు. పదేళ్ల తన పాలనలో ఎమ్మెల్యేలతో కేసీఆర్ ఎప్పుడైనా మాట్లాడారా.. ? నలుగురితో నారాయణ అన్నట్టుగా అందరిని సమావేశపరిచి మాట్లాడటమే. అది కూడా వేళ్లపై లెక్కపెట్టే అన్నిసార్లు జరిగాయి ఆ సమావేశాలు. వారు అపాయింట్‌మెంట్ కోరినా ఇవ్వలేదన్న ఆరోపణలు ఎన్నో.. కానీ ఇప్పుడు ఉన్న ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు కేసీఆరే నేరుగా ఫోన్ చేసినా.. ఎవ్వరూ పట్టించుకోవడం లేదని తెలుస్తుంది. ఎమ్మెల్యే జంపింగ్స్‌తో కేసీఆర్‌లో టెన్షన్ మొదలైనట్టు తెలుస్తుంది. ఫామ్‌హౌస్‌లో హరీశ్‌రావు, కేటీఆర్‌తో ప్రత్యేకంగా మీట్ అయ్యారు. అసలు ఎమ్మెల్యేలను ఆపడం ఎలా టాపిక్‌పై డిస్కషన్ చేశారు. ఎందుకంటే పోచారం లాంటి నేతే కాంగ్రెస్ చేరడం అనేది కేసీఆర్‌కు అస్సలు మింగుడు పడని అంశం. దీంతో ఇతర ఎమ్మెల్యేల పరిస్థితి ఏంటని ఆరా తీశారు. జంప్ అయ్యే ఎమ్మెల్యేల లిస్ట్ తయారు చేశారు. వారికి నేరుగా కేసీఆర్ ఫోన్ చేసి మాట్లాడినట్టు తెలుస్తుంది. పార్టీ మారవద్దని కష్టకాలంలో పార్టీకి అండగా ఉండాలని హితబోధ చేసినట్టు తెలుస్తుంది. అయితే వారిని ఫామ్‌హౌస్‌కు రమ్మని పిలిచినా.. ఒక్కరు కూడా పట్టించుకోలేదని తెలుస్తుంది.

**శాసనమండలిపై కాంగ్రెస్ ఫోకస్.. టార్గెట్ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు :** అయితే కేసీఆర్‌కు రెండు రకాల టెన్షన్స్ మొదలైనట్టు తెలుస్తుంది. ఓ వైపు కాంగ్రెస్.. మరోవైపు బీజేపీ.. అవును.. బీజేపీ కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై నజర్ పెట్టింది. రెండు పార్టీలు కూడా ఆపరేషన్ ఆకర్ష్ మొదలుపెట్టాయి. ఒకటి రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ.. మరొకటి కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ..దీంతో చాలా మంది ఎమ్మెల్యేలు




ఏ పార్టీలో చేరాలన్న దానిపై లెక్కలు వేసుకుంటున్నట్టు తెలుస్తుంది. ఇప్పటికే పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు నజర్ పెట్టినట్టు తెలుస్తోంది. అలాంటి నేతలంతా త్వరలో కాషాయ కండువా కప్పుకోవడం ఖాయంగా కనిపిస్తుంది. కానీ మెజార్టీ ఎమ్మెల్యేల చూపు కాంగ్రెస్‌వైపే ఉన్నట్టు తెలుస్తుంది. దీనికి సంబంధించి ఇప్పటికే జోరుగా మంతనాలు నడుస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితంగా ఉండే ఓ అగ్రనేత ఈ వ్యవహారాలను చక్కదిద్దుతున్నట్టు తెలుస్తోంది. పోచారం కాంగ్రెస్‌లో అధికారికంగా చేరడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య 38కు చేరింది. కనీసం తక్కువలో తక్కువ 12 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరతారనేది ప్రస్తుతం వినిపిస్తున్న టాక్.. మిగిలిన ఎమ్మెల్యేల చూపు బీజేపీవైపు ఉన్నట్టు కనిపిస్తుంది. మొత్తానికి అప్పుడు సిగలు పట్టుకొని పార్టీ నేతలను ఓ ఆట ఆడించిన కేసీఆర్.. ఇప్పుడు కాళ్లు పట్టుకొని ప్రాధేయపడేంత పని చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని తెలుస్తుంది.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## దెబ్బకు దెబ్బ...వేటుకు వేటు...అదుర్స్ !

ఈ మాటలు ఎక్కడో విన్నట్లుగా ఉన్నాయి కదూ. ఇదే బాలయ్య సినిమా డైలాగు. ఇదే నారా లోకేష్ చాలా సార్లు వాళ్ళ మామ మాదిరిగా డైలాగుని అనేక సభలలో వాడారు. సరిగ్గా అదే ఇపుడు ఏపీలో జరుగుతోంది. సరిగ్గా అయిదేళ్ళకు ముందు 151 సీట్లతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం చేసిన మొట్ట మొదటి పని ప్రజా వేదిక కూల్చివేత. అది అక్రమ కట్టడం అని పేర్కొంటూ జగన్ ప్రభుత్వం దాన్ని కూలదోయించింది. అయితే ఆ సమయంలో పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తం అయ్యాయి. టీడీపీ వర్గాలు అయితే ఇది విధ్వంసక ప్రభుత్వం అని విమర్శించారు. ఇక తటస్థ వర్గాలతో పాటు కొందరు మేధావులు సైతం కూల్చడం అంటే ప్రజా ధనం దుర్వినియోగం చేసినట్లని భావించారు. ఆ విధంగా కాకుండా దానిని ప్రభుత్వ కార్యక్రమాలకు ఉపయోగించుకుంటే బాగుండేది అని కూడా అన్నారు. ఒక విధంగా ప్రజా వేదిక కూల్చివేతతో వైసీపీ ప్రభుతం తన యాక్షన్ ప్లాన్ ని స్టార్ట్ చేసింది అని చెప్పాలి. ఇక సీన్ కట్ చేస్తే ఇపుడు ఏపీలో టీడీపీ అధికారంలోకి వచ్చింది టీడీపీ ప్రభుత్వం వచ్చాక వైసీపీ అక్రమంగా పార్టీ ఆఫీసులను కడుతోందని పేర్కొంటూ వాటిని కూలగొడుతోంది. దానిని నాందిగా గుంటూరు జిల్లాలో ఒక దానిని కూలగొట్టారు. లీజుకు తీసుకుని కట్టడాలు నిర్మిస్తున్నా కూడా హై కోర్టు ఆదేశాలను పక్కన పెట్టి మరీ కూల్చేస్తున్నారు అని వైసీపీ వాపోతోంది. హై కోర్టు ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ ఈ విధంగా కూల్చడం తగునా అని వైసీపీ అంటోంది. అయినా అధికారం ఇపుడు చేతులు మారింది. దాంతో ఇలా జరుగుతోంది అని అంటున్నారు. అలా ప్రజా వేదిక కూల్చివేతకు ఇది జవాబు అనుకోవాలా లేక దీనికి రెట్టింపు అనుకోవాలా అంటే జవాబు తరువాత తెలుస్తుంది కానీ ప్రస్తుతానికి అయితే ప్రజా వేదిక కూల్చివేత వర్సెస్ వైసీపీ ఆఫీసు కూల్చివేత అని అంటున్నారు. నిజానికి ప్రజలు ఓట్లు వేసేది ప్రభుత్వాన్ని తెచ్చేది తమకు మేలు చేయడం కోసం అన్నది ప్రజా స్వామ్యంలో అందరికీ తెలిసిన విషయం. అలాగే అందరికీ అర్ధం అయిన విషయం. కానీ గత వైసీపీ తీరు చూసినా ఇపుడు టీడీపీ వ్యవహార శైలి చూసినా దెబ్బకు దెబ్బ వేటుకు వేటు అన్నట్లుగానే కథ సాగుతోంది అని అంటున్నారు. దీంతో మేధవులు ప్రజాస్వామ్య ప్రియులు అంతా విస్తుబోతున్నారు. ఆలోచనలో పడుతున్నారు. ప్రభుత్వం వచ్చేది ప్రజల కోసమా లేక కక్ష సాధింపు చర్యలు తీసుకొవడానికా అన్న దాని మీద సర్వత్రా చర్చ సాగుతోంది. ప్రజలకు రాజకీయాలు ఉండవు. వారు దేనినీ పట్టించుకోరు. తమ వరకే వారు చూస్తారు. తమ ప్రయోజనాలు దక్కాయా లేదా అన్నది చూస్తారు. అలా కాకుండా రాజకీయ కక్షలు కార్పణ్యాలు తీచుకోవడానికి అధికారం ఇవ్వలేదని వైసీపీ విషయంలో నిరూపించారు. వైసీపీ ఒక వైపు సంక్షేమం అందిస్తూనే కక్షలకు తెర లేపింది. టార్గెట్ చేసి మరీ టీడీపీ నేతలను అరెస్టుల మీద అరెస్టులు చేసింది. అలాగే అనేక కేసులు పెట్టింది. ఇదంతా చూసిన జనాలు ఆ ప్రభుత్వం వద్దు అనుకుని ఓటేశారు. తీరా ఇపుడు చూస్తే మళ్లీ అలాంటి విధానంతోనే ముందుకు పోతామని కొత్త ప్రభుత్వం భావిస్తే కనుక ప్రజలు కూడా ఆలోచిస్తారు అని అంటున్నారు. ఒక నిర్మాణం ఏదైనా కష్టంతో కూడుకున్నదే. దానిని అక్రమం అని తేల్చినపుడు ప్రభుత్వమే స్వాధీనం చేసుకుని వినియోగం లోకి తేవడం మంచి పని. ప్రభుత్వం అంటే ప్రజల కోసం పనిచేసేది అని ఆ విధంగా అర్ధం అవుతుంది. అంతే తప్ప బుల్డోజర్లు ప్రొక్లైనర్లకు పని చెప్పి కూల్చివేతలకు తెర తీస్తే అపుడు విధ్వంశం తప్ప ఏమి మిగులుతుంది అని అంటున్నారు. ఎక్కడైనా ప్రజలు లా అండ్ ఆర్డర్ బాగుండాలని కోరుకుంటారు. అది బాగుండాలీ అంటే కక్షలు ఆగిపోవాలి. లేకపోతే ఒక దానికి అవతల వైపు నుంచి కూడా జవాబు వస్తుంది.

అలా చూస్తే ఇక ఘర్షణ తప్ప ఏమీ మిగలదు. ఏది ఏమైనా ఇది మంచి పరిణామం కాదని అంటున్నారు. ఏపీ ప్రస్తుతం ఉన్న పరిస్థితులను చూసి అయినా రాజకీయ పార్టీలు పాలకులు సహనంతో ముందుకు పోవాలని కోరుతున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# నకిలీ విత్తనాల కేసులో నిందితుల బెయిల్ రద్దు

**ముసిఫ్ కోర్టు లో లొంగిపోయిన ప్రధాన నిందితులు**
**14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించిన కోర్టు**
**ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి వెల్లడి**



**ఆదిలాబాద్ జూన్ 24(ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ పట్టణంలో పెద్ద ఎత్తున నకిలీ విత్తనాల తయారు కేంద్రాన్ని నెలకొల్పి, రైతులను మోసగించే ముఠాను జిల్లా పోలీసులు అరెస్టు చేసి రూ.500 కిలోల 19 లక్షల విలువగల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ క్రమంలో వారికి బెల్ లభించడంతో, జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఆదేశాల మేరకు జిల్లా సెషన్స్ కోర్టు నందు రివిజన్ ఫైల్ చేయగా, వాదనలు విన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే ప్రభాకర్ రావు బెయిల్ ను రద్దుచేసి మూడు రోజుల్లోగా లొంగిపోవాలని ఆదేశించారు. దీంతో నిందితులు సామ అశోక్ రెడ్డి. రాజేందర్ లు మున్సిఫ్ కోర్టు లో లొంగిపోయారు. కోర్టు వారిని 14 రోజుల జ్యూడిషియల్ కస్టడీని విధించడంతో జిల్లా జైలుకు తరలించారు. మహారాష్ట్రలోని జాల్నా, కర్ణాటక, హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలలో గల ఆఫీసుల నందు తనిఖీలు నిర్వహిస్తూ విచారించేందుకు జిల్లా పోలీసులు తరఫున ప్రధాన నిందితులను 10 రోజుల పోలీసు కస్టడీని కోరడం జరుగుతుందని ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. నేరానికి పాల్పడినటువంటి నిందితులకు ఆశ్రయమిచ్చిన షాపుల ఓనర్ కు నోటీసులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. గోడౌన్ ను ఎమ్మార్వో సమక్షంలో స్వాధీనం . చేయడం జరిగిందన్నారు.

# గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలి

**- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా**



**ఉట్నూర్ జూన్ 24(ప్రభాత సమాచారం)**
గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను ఆమె స్వీకరించారు. నేరదిగొండ మండలం బుగ్గరాం గ్రామానికి చెందిన స్వాతి తనహటావిహక్కు పత్రంపై పేరు మార్పించమని, ఇంద్రవెల్లి మండలం మార్కగూడ గ్రామానికి చెందిన భీంరావ్ తనకి కిరాణా దుకాణం మంజూరు చేయించామని ,ఉట్నూర్ మండలం ఉట్నూర్ గ్రామానికి చెందిన శశిరేఖ ఏదైనా గురుకుల పాఠశాలలో ఉద్యోగం కావాలని, నేరదిగొండ మండలం చించొలి గ్రామానికి చెందిన సూర్యామణి మేకల లోన్ కావాలని కోరారు. పింఛన్, రెండుపడక గదుల ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీవో సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణిలో ఏపిఓ కనక భీంరావ్, డిడి దిలీప్ కుమార్,అదనపు వైద్యాధికారి కుంరం బాలు ఆర్ సి ఓ గంగాధర్,ఎఓ రాంబాబు,ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డిపిఓ ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు ఎల్లవేళల ప్రజలకు అందుబాటులో ఉండాలి

**ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**



**ఖానాపూర్ జూన్ 24(ప్రభాత సమాచారం)**
అన్ని శాఖల అధికారులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి, సమస్యలను పరిష్కరించాలని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఖానాపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగిన సర్వ సభ్య సమావేశంలో పాల్గొన్నారు. శాఖల వారీగా అధికారులు నివేదికలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. ఈరిగేషన్, వ్యవసాయం,వైద్యం ,విద్య,అనే అంశాలపై ప్రధానంగా సంబంధిత అధికారులు దృష్టి సారించాలన్నారు. మార్కెట్ లో నకిలీ విత్తనాలు రాకుండా కట్టడి చేయాలన్నారు. ప్రభుత్వ భూములు కబ్జాలకు గురి కాకుండా చూసుకోవాలన్నారు. కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో పట్టణాల్లో కరెంటు కోతలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు అభివృద్ధి పనులపై నివేదికలను తమకు సమర్పిస్తే ఆ సమస్యల పరిష్కరానికి కృషి చేస్తామన్నారు. పెండింగ్ బిల్లులు ఉంటే త్వరగా మంజూరు అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎల్ల వేళల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఖానాపూర్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కారం చేయడం కోసం మార్నింగ్ వాక్, ఫోన్ ఇన్, పల్లె బాట లాంటి కార్యక్రమాలను చేపట్టి ప్రజలు ఎదురుకుంటున్న సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఏకకాలంలో 2 లక్షల రుణమాఫీ చేయడం పట్ల హర్షం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ,ఎంపీటీసీలు,అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లికి మళ్లీ సబ్‌కలెక్టర్



బెల్లంపల్లి : బెల్లంపల్లిలో సబ్‌కలెక్టర్ పోస్టు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో బెల్లంపల్లిలో సబ్‌కలెక్టర్ పోస్టు ఉండేది. 2018లో అప్పటి రాష్ట్రప్రభుత్వం సబ్‌కలెక్టర్ పోస్టు మంజూరు చేసింది. 2020లో మళ్లీ ఆర్డీఓను నియమించారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం జిల్లాల పునర్విభజన సమయంలో బెల్లంపల్లిలో జిల్లా ఏర్పాటు కోసం ఉద్యమాలు కొనసాగాయి. ఈ నేపథ్యంలో మంచిర్యాలను జిల్లాగా ప్రకటించిన ప్రభుత్వం బెల్లంపల్లిని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసింది. 2016 అక్టోబరు 10న తొలి ఆర్డీఓగా ఎన్.పాండురంగ బాధ్యతలు స్వీకరించారు. బెల్లంపల్లికి ప్రాధాన్యత దృష్ట్యా 2018 జనవరి 4వ తేదీన సబ్‌కలెక్టర్ పోస్టును మంజూరు చేసి సబ్‌కలెక్టర్‌గా రాహుల్‌రాజ్‌ను నియమించారు. రెండేళ్లు పనిచేసిన తర్వాత రాహుల్‌రాజ్ బదిలీ అయ్యారు. అయిదు రోజుల పాటు స్నేహలత సబ్‌కలెక్టర్ బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం మరో నాలుగు నెలల పాటు సురేందర్‌రావు ఇన్‌ఛార్జి సబ్‌కలెక్టర్‌గా కొనసాగారు. మళ్లీ ఆర్డీఓగా శ్యామలదేవిని ప్రభుత్వం నియమించింది. ఈమె రెండేళ్లపాటు పనిచేశారు. మూడు నెలలపాటు కాసబోయిన సురేష్ ఆర్డీఓగా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం ఆర్డీఓగా గత ఏడాది నవంబర్‌నుంచి హరికృష్ణ కొనసాగుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆక్రమణలు ఉన్నచోట ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఈ నేపథ్యంలోనే బెల్లంపల్లికి సబ్‌కలెక్టర్ పోస్టును మంజూరు చేస్తూ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి ఈ నెల 13వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. అయిదేళ్లలో బెల్లంపల్లి పట్టణంతో పాటు మండలంలో ఆక్రమణల జోరు కొనసాగింది. ఎక్కడ ఏ భూమి ఆక్రమణకు గురైందో ఇప్పటికీ రెవెన్యూ అధికారులకు సమాచారం లేదు. ఏకంగా రెవెన్యూ అధికారులే అక్రమార్కు లకు వంత పాడడంతో ప్రభుత్వ భూములు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ గెలిచినప్పటి నుంచి భూఆక్రమణల విషయంలో అంత సీరియస్‌గా లేకున్నప్పటికీ తెరవెనుక వీటిని అరికట్టేం దుకు పకడ్బందీగా పావులు కదిపారు. ఆర్డీఓ స్థాయిలో ఆక్రమణలకు కళ్లెం వేయలేమని గ్రహించిన వినోద్ బెల్లంపల్లికి ఐఏఎస్ అధికారిని నియమించేలా ప్రభుత్వానికి నివేదికలు పంపారు. గతంలో దుర్గం చిన్నయ్య ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కబ్జా ఆరోపణలు ఎదుర్కొన్నారు. అనుచరులే ఆక్రమణలకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయి. ఈ అనుభవంతో ఎమ్మెల్యే వినోద్ ముందుజాగ్రత్తగా ఐఏఎస్‌ను నియమించేలా ప్రభుత్వంపై తీసుకొచ్చిన ఒత్తిడి ఫలించింది. గతంలో రాహుల్‌రాజ్ సబ్‌కలెక్టర్‌గా ఉన్న సమయంలో అతనే స్వయంగా వెళ్లి ఆక్రమణల స్థలాల్లో బోర్డులు పాతిన సందర్భాలు ఉన్నాయి.

# ప్రవేటు పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నాం

**ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు**



**ఖానాపూర్ జూన్ 24(ప్రభాత సమాచారం)**
ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండల కేంద్రంలో గతంలో మూతబడిన ఉర్దూ మీడియం పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం స్కూల్‌ను సోమవారం మళ్ళీ పున:ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థకు మొదటి ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అద్భుతంగా తీర్చిదిద్దడం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు,తల్లి తండ్రులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రెండేళ్లుగా ఎదురుచూపులు

సంగారెడ్డి : ఒకప్పుడు కుటుంబ వ్యవస్థలో పెద్దల మాటే శరణ్యం. పెద్దలకు సేవ చేయటం, గౌరవించడం విద్యుక్త ధర్మాలుగా భావించే సంస్కృతి. సంపాదన మొత్తాన్ని కుటుంబ పెద్ద చేతిలోనే పెట్టి అవసరాలకు డబ్బు అడిగి తీసుకునే వారు. కుటుంబ పెద్ద ఏ నిర్ణయం తీసుకున్నా తమ ఉన్నతికేనని కట్టుబడి ఉండే సంస్కృతిలో క్రమంగా మార్పులు వచ్చాయి. సమాజంలో ప్రస్తుతం వయోవృద్ధుల్లో ఎక్కువ మంది నిరాదరణకు గురవుతున్నారు. ఇది ఆందోళన కల్గించే పరిణామం. ఇలాంటి వృద్ధుల ఇబ్బందులు దూరం చేయాలనే లక్ష్యంతో వృద్ధాశ్రమాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. జిల్లాకు రెండేళ్ల కిందట మంజూరు చేసిన వృద్ధాశ్రమం ఇప్పటికీ వినియోగంలోకి రాలేదు.

రాష్ట్ర వ్యాప్తంగా మూడు..: సంగారెడ్డి, సిరిసిల్ల, ఆదిలాబాద్ జిల్లాల్లో వృద్ధాశ్రమాల ఏర్పాటుకు ప్రభుత్వం రెండేళ్ల కిందట నిర్ణయించింది. ఈ మేరకు మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖలకు ఉత్తర్వులు జారీ చేసింది. రెడ్ క్రాస్ సంస్థతో కలిసి వీటి నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆయా జిల్లా కలెక్టర్లకు ఆదేశాలిచ్చింది. ప్రభుత్వం మూడు వృద్ధాశ్రమాలకు.. ఒక్కోదానికి రూ.50 లక్షల చొప్పున కేటాయించింది. వృద్ధాశ్రమ నిర్వహణను రెడ్‌క్రాస్ సొసైటీ చూడనుంది.

మహిళా ప్రాంగణంలో నిర్మాణం: జిల్లాకు మంజూరైన వృద్ధాశ్రమం నిర్మాణానికి మహిళా ప్రాంగణం ఆవరణను ఎంపిక చేశారు. రూ.50 లక్షలు వెచ్చించి నిర్మాణ పనులు చేపట్టారు. నిధుల లేమితో పనులు మధ్యలోనే ఆగిపోయాయి. వసతుల కల్పన, తదితరాలకు మరిన్ని నిధులు అవసరం కాగా.. నిధుల విడుదల లేకపోవడంతో మిగతా పనులు ఏడాదిగా ముందుకు సాగడం లేదు. దీంతో ఏ ఆసరా లేని వృద్ధులు రహదారుల పక్కన కాలం వెళ్లదీస్తున్నారు. ఎండకు ఎండుతూ.. వానకు తడస్తూ దయనీయంగా జీవనం సాగిస్తున్నారు. వృద్ధాశ్రమం వినియోగంలోకి వస్తే వీరి ఇబ్బందులు దూరమయ్యే అవకాశం ఉంటుంది.

ప్రతిపాదనలు పంపుతున్నాం:లలితకుమారి, జిల్లా సంక్షేమాధికారిణి వృద్ధాశ్రమం పనులు పూర్తి చేసేందుకు అదనపు నిధుల కోసం ప్రయత్నిస్తున్నాం. ఇటీవల కలెక్టర్ వల్లూరు క్రాంతి నిర్మాణ పనుల్ని పరిశీలించారు. పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు పంపేందుకు కసరత్తు చేస్తున్నాం. ప్రభుత్వం తీసుకువచ్చిన వయోవృద్ధుల సంరక్షణ చట్టాలు అమలు చేస్తాం. వారికి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

జిల్లా జనాభా: 15.27లక్షలు
వృద్ధాప్య పింఛను పొందుతున్న వారు: 49,696

# అధ్యాపకుల కొరత.. ఆటలకు వెత!

మెదక్ : క్రీడాకారులకు వసతులు కల్పించి, నైపుణ్య శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దుతామని సర్కారు ప్రకటిస్తున్నా క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడంలేదు. ఇందుకు కారణం వ్యాయామ అధ్యాపకుల కొరత. జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ భర్తీ చేయడంలేదు. దీంతో విద్యార్థులు రాణించలేకపోతున్నారు. ఉత్సాహం ఉన్నా, శిక్షణ కొరవడడంతో ఆటలకు దూరమవుతున్నారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ఈ సారైనా వీరి నియామకానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా 16 ప్రభుత్వ కళాశాలలు ఉన్నప్పటికీ వీటిల్లో ఏ ఒక్క కళాశాలలో వ్యాయామ అధ్యాపకులు కనిపించని పరిస్థితి నెలకొంది. మిగతా గురుకులాలు, ఆదర్శ తదితర వాటిల్లో ఒప్పంద పద్ధతిలో వ్యాయామ అధ్యాపకులను నియమించడంతో ఆయా విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు మాత్రమే వివిధ క్రీడల పోటీల్లో రాణిస్తున్నారు. గత ప్రభుత్వం 20 ఏళ్ల నుంచి ఒప్పంద ఉపన్యాసకులుగా పని చేసిన వారిని క్రమబద్ధీకరించినా, వ్యాయామ అధ్యాపకులను మాత్రం నియమించలేదు.

వర్తించని రిజర్వేషన్లు: క్రీడలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఉన్నత విద్య, ఉద్యోగ తదితర అవకాశాల్లో ప్రత్యేక కోటాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. రాష్ట్ర స్థాయిలో రాణించిన విద్యార్థులకు రిజర్వేషన్లు వర్తింపజేస్తున్నారు. చదువుకు ఇది అదనపు అర్హతగా గుర్తిస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో చదివే విద్యార్థులు ఈ అవకాశాలను కోల్పోతున్నారు. కళాశాలలకు గతంలో క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. సాధన చేయించేవారు లేకపోవడంతో అవి మూలకు చేరాయి.

# పిచ్చుకలపై బ్రహ్మాస్త్రాలా?

కుత్బుల్లాపూర్ : భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు తారతమ్యం ప్రదర్శిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. కబ్జాలకు పాల్పడుతున్నవారు ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఎకరాలకు ఎకరాల ప్రభుత్వ భూములను కబళించి ప్లాట్లు చేసి విక్రయిస్తూ రూ.కోట్లకు పడగెత్తుతున్న వారిని వదిలేసి చిన్నాచితకా స్థలాలను కబ్జా చేస్తున్న వారిపై ఉక్కుపాదం మోపి మమ అనిపించుకుంటున్నారు. కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ రికార్డుల ప్రకారం గాజులరామారం 13 సర్వేనంబరులో 5.37 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండాలి. కాని ఇందులో రూ.155 కోట్ల విలువచేసే 5.17 ఎకరాల భూమిని డబ్బు, పరపతి కలిగిన కొందరు కబ్జా చేసి తమ వెంచర్‌లో కలుపుకొన్నారు. ఆనంతరం ఆ స్థలాన్ని 200-250 చదరపు గజాల చొప్పున ప్లాట్లుచేసి ప్రైవేటు పట్టా సర్వే నంబర్లతో ఒక్కో ప్లాటును రూ.కోటి నుంచి కోటిన్నరకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. సంబంధిత దస్తావేజుల ఆధారంగా జీహెచ్ఎంసీ వారు నిర్మాణ అనుమతులు జారీచేయడంతో అందులో బహుళ అంతస్తుల మేడలు వెలిశాయి. దీంతో మిగిలిన అర ఎకరం భూమిపై చిన్నాచితకా భూకబ్జాదరుల కన్ను పడింది. ఇందులో గుడి నిర్మాణం చేయగా మిగిలిన సుమారు 500 చదరపు గజాల స్థలంలో ఇటీవల గదులు



నిర్మించడానికి సన్నద్ధమయ్యారు. రెవెన్యూ అధికారులు అడ్డుకుని బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అయితే రూ.155 కోట్ల విలువచేసే 5.17 ఎరాల భూమిని కబళించిన వారిపై మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఇక్కడ భూకబ్జాలకు పాల్పడిన వ్యక్తులే గాజులరామారం 329లో సుమారు ఎకరం, 12 సర్వేనంబరులో రెండు ఎకరాలు 100 సర్వేనంబరులో 1300 చదరపు గజాల స్థలాన్ని కబ్జా చేసి ప్లాట్లు చేసి విక్రయించినట్లు ఆరోపణ లున్నాయి.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

నేను బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి 13 సర్వేనంబరు ప్రభుత్వ భూమిలో ఎటువంటి ఆక్రమణలు జరగలేదు. కాని గతంలో జరిగిన ఆక్రమణలపై అప్పటి తహసీల్దార్ ఆదేశాల మేరకు సంబంధిత భూమిని సర్వే నిర్వహించి కొందరికి ఎన్‌ఓసీలు జారీచేసినట్లు సమాచారం ఉంది. అయితే తాజాగా ఆ సర్వే నివేదికల ఆధారంగా మరోసారి క్షేత్రస్థాయి పరిశీలన చేస్తాం. అందులో ఎవరెవరు ఎంత ఆక్రమించారనేదానిపై ఒక నివేదిక రూపొందించి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. రజనీకాంత్, ఆర్ఐ కుత్బుల్లాపూర్

# సున్నాబిల్లు.. అందక గోల్లు

హైదరాబాద్:గృహజ్యోతి పథకం అమలుకు ఆపసోపాలు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం ఎన్నికలు కాగానే అర్హులకు సున్నా బిల్లు ఇవ్వాలని సూచించినా..ఇంతవరకు అధికారికంగా ఎలాంటి చర్యలు లేదు. నగరంలో మరో 5 లక్షల మంది వినియోగదారులు ఎదురుచూస్తున్నారు. నిత్యం విద్యుత్తు, జీహెచ్ఎంసీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

పాత దరఖాస్తులు ఏమయ్యాయి..?

గృహజ్యోతి పథకం నిరంతర ప్రక్రియ అని.. రానివారు మళ్లీ దరఖాస్తు చేసుకుంటే మరుసటి నెలలో సున్నా బిల్లులు వస్తాయని విద్యుత్తు ఉన్నతాధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. మార్చిలో విద్యుత్తు సిబ్బంది దరఖాస్తుదారుల ఇంటింటికి వెళ్లి విద్యుత్తు బిల్లులకు ఆహార భద్రత కార్డు వివరాలను అనుసంధానం చేశారు. అయినా వీరిలోనూ చాలామందికి సున్నా బిల్లులు రాలేదు. రానివారు మార్చి నెలలో జీహెచ్ఎంసీ ప్రజాపాలన సేవ కేంద్రాలకు వెళ్లి ఆహార భద్రత కార్డుతో కలిపి మళ్లీ దరఖాస్తు చేసుకున్నారు. కొందరికి సవరించిన బిల్లులు జారీ చేశారు. మిగతావారికి ఎందుకు రాలేదు అనేది స్పష్టత లేదు.

ఇదేం తిరకాసు.. అర్హత ఉండి సున్నా బిల్లులు రానివారు ఉంటే జీహెచ్ఎంసీ ప్రజాపాలన సేవా కేంద్రాల్లో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని విద్యుత్తు అధికారులు చెబుతున్నారు. ప్రజాపాలన దరఖాస్తులు తీసుకోవాలని తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని జీహెచ్ఎంసీ అధికారులు చెప్పి పంపిస్తున్నారు.

ఇక్కడ ఇలా : నగరంలో 9 సర్కిళ్ల పరిధిలో గృహ వినియోగదారులు




దాదాపు 50.18 లక్షల మంది ఉన్నారు. వీరిలో 20 లక్షల మంది గృహజ్యోతి పథకానికి డిసెంబరు 28 నుంచి జనవరి 6 వరకు జరిగిన ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నారు. ఆహార భద్రత కార్డు తప్పనిసరి చేయడంతో అర్హుల సంఖ్య 12 లక్షలకు తగ్గినట్లు అంచనా. వీరిలో 7.01 లక్షల వినియోగదారులకు మాత్రమే సున్నా బిల్లులు వస్తున్నాయి. అర్హులైన మరో ఐదు లక్షల మంది గృహజ్యోతికి ఎదురుచూస్తున్నారు. తమ దరఖాస్తులకు సంబంధించిన పురోగతిపై సమాచారం ఇచ్చేవారు లేకపోవడంతో.. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని విద్యుత్తు అధికారులు చెబుతుండటంతో వీరు జీహెచ్ఎంసీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే మండలకార్యాలయాలను సంప్రదిస్తున్నారు.

ఒకవేళ ఏదైనా కారణంతో దరఖాస్తు ప్రక్రియ మధ్యలోనే ఆగిపోతే ఆ వివరాలు వినియోగదారుడు తెలుసుకునే వ్యవస్థ లేకపోవడం పెద్ద లోపంగా ఉంది. ప్రజాపాలనలో ప్రతి దరఖాస్తుకు ఒక నెంబరు ఇచ్చారు. ఆ వివరాలు నమోదు చేయగానే ఏ దశలో ఉందో తెలిపే వ్యవస్థ వినియోగదారులకు అందుబాటులో ఉంటే ఈ గందరగోళం తప్పుతుంది. సున్నా బిల్లుల వినియోగదారులు

# 20 మండలాలకు ఒకే ఒక్క ఎంఈఓ!




పరిగి : పాఠశాలలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వం 'మన ఊరు..మన బడి' పేరిట, ప్రస్తుతం 'అమ్మ ఆదర్శ పాఠశాలల' పేరుతో అభివృద్ధి పనులు చేపడుతోంది. మరోవైపు బడి ఈడు కలిగిన పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు 'బడిబాట' నిర్వహిస్తోంది. ఇంతవరకు బాగానే ఉన్నా పాఠశాలల పనితీరును పరిశీలన, పర్యవేక్షించే అధికారులు లేకపోవడంతో నిర్వహణ గాడితప్పుతోంది.

ఇన్‌ఛార్జులుగా ప్రధానోపాధ్యాయులు

జిల్లాలోని 20 మండలాలకు 20మంది మండల విద్యాధికారులు (ఎంఈఓ) ఉండాలి. కానీ ఒకే ఒక్కరు మాత్రమే పూర్తిస్థాయి ఎంఈఓగా పనిచేస్తున్నారు. మిగతా మండలాలకు ప్రధానోపాధ్యాయులే ఇన్‌ఛార్జిలుగా వ్యవహరిస్తున్నారు. అదనపు బాధ్యతల కారణంగా వారు ఎటూ న్యాయం చేయలేకపోతున్నామని వాపోతున్నారు. జిల్లా ఉప విద్యాధికారి పోస్టులు కూడా ఖాళీగా ఉండటం శోచనీయం పాఠశాలలు పు:న ప్రారంభమైన నేపథ్యంలో కనీసం ఈ ఏడాదైనా సిబ్బంది భర్తీకి చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

85వేల మందికి పైగా విద్యార్థులు

పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలో 776 ప్రాథమిక, 116 ప్రాథమికోన్నత, 176 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉండగా సుమారు 85వేలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఎంఈఓలు లేక పాఠశాలల నిర్వహణ గాడి తప్పుతోందని గతం నుంచి ఫిర్యాదులు అందుతున్నా క్షేత్రస్థాయిలో పరిశీలించి పట్టించుకునే వారు లేకుండా పోయారు. దోమ మండల విద్యాధికారిగా పనిచేస్తున్న హరిశ్చందర్ పరిగి, పూడూరు మండలాలకు సైతం అదనపు బాధ్యతలను నిర్వహించాల్సి వస్తోంది.

పదిలో ర్యాంకు నానాటికీ తీసికట్టు

పర్యవేక్షణ ప్రభావం ఫలితాలపై పడింది. నెల రోజుల క్రితం వెలువడిన పదో తరగతి ఫలితాలు ఈసారి కూడా నిరాశాజనకంగానే ఉన్నాయి. ఈసారి 13,357 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా కేవలం 8695 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. 2022-23 విద్యా సంవత్సరంలో 13,399 పరీక్షలకు హాజరైతే 7967 మంది పాసయ్యారు. గత రెండేళ్లుగా వరుసగా వెనుకబడి పోతుండటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇరవై ఏళ్లుగా భర్తీలు లేవు పి.సత్యనారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడు, టీయూటీఎఫ్2005లో పదోన్నతులు ఇచ్చారు. ఇరవై ఏళ్లుగా ఎంఈఓ పోస్టులు భర్తీ చేయడం లేదు. పర్యవేక్షణ లోపంతో శాఖాపరమైన సమస్యలు తలెత్తుతున్నాయి. అంతేగాకుండా పాఠశాల అభివృద్ధికి ప్రధాన అవరోధంగా మారింది. సత్వర నిర్ణయాలకు విపరీత జాప్యం జరగడం కూడా ఫలితాలపై ప్రభావం ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ పడుతోంది.ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది రేణుకాదేవి, జిల్లా విద్యాధికారిణి

పోస్టుల భర్తీ విషయంలో ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. పాఠశాలల నిర్వహణలో సమస్యలు రాకుండా ఉండేందుకు సీనియర్ ప్రధానోపాధ్యాయులను ఇన్‌ఛార్జిలుగా నియమించాం. ఈసారి పది ఫలితాలపై ముందునుంచే మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఉత్తమ ఫలితాలను సాధిస్తాం.

# సమావేశాలే లేవు.. సమస్యల పరిష్కారమెలా..?



పరిగి :ప్రజలకు చిన్నపాటి అనారోగ్యం వచ్చినా వెంటనే గుర్తొకొచ్చేది సర్కారు ఆసుపత్రి. వీటిలో సౌకర్యాలు బాగుంటే పేదలే కాదు, ఉన్నతాదాయ వర్గాలు కూడా వస్తారు. అందుకోసమే ప్రభుత్వం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ (హెచ్‌డీఎస్)లను ఏర్పాటుచేసింది. ఇవి ఆసుపత్రుల బాగోగుల గురించి ప్రతి మూడు నెలలకోసారి సమావేశాలను నిర్వహించాలి. అవసరమైన సదుపాయాలపై చర్చించాలి. కానీ ఈ కమిటీల జాడ ఎక్కడా కనిపించడంలేదు. దీంతో జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ గాడి తప్పుతోందనే విమర్శలొస్తున్నాయి. దీనికి సంబంధించి కథనం.

ప్రజా ప్రతినిధులే ఛైర్మన్లు

జిల్లా ఆసుపత్రులకు జడ్పీ ఛైర్మన్లు, నియోజక వర్గాల్లో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రాలకు ఎమ్మెల్యేలు, పుర ఛైర్మన్లు, పీహెచ్‌సీలకు ఎంపీపీలు ఛైర్మన్లుగా వ్యవహరిస్తారు. ఈ కమిటీల్లో స్థానికంగా ఉన్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. జడ్పీ ఛైర్మన్లు, ఎంపీపీల పదవీ కాలం కొద్ది రోజుల్లో ముగియనుంది. జిల్లాలో నాలుగు నియోజక వర్గాలకు కొత్తగా ఎమ్మెల్యేలు వచ్చారు. కనీసం వీరైనా పట్టించుకుంటారా అని పలువురు సందేహాలు వ్యక్తం చేస్తునారు. సరైన పర్యవేక్షణ లేక సిబ్బంది ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారన్నారు. పారిశుద్ధ్యం పట్టించుకోవడంలేదన్నారు.

దోమ, పూడూరు తదితర మండలాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు శిథివాస్థలకు చేరాయి. ఎప్పుడో మండల వ్యవస్థ ఏర్పడినప్పుడు నిర్మించిన భవనాలే నేటికీ కొనసాగుతున్నాయి.

వికారాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోనూ అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

నిధుల మంజూరేదీ..

ప్రభుత్వ ఆసుపత్రులకు ప్రభుత్వం నుంచి సరిపడా నిధులు మంజూరు కావడంలేదు. దీంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని వైద్యాధికారులు పేర్కొంటున్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశాలు నిర్వహించాల్సి ఉండగా నిధుల కొరతతో సమావేశమైనా ఫలితం ఉండదనే భావనతో ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పీహెచ్‌సీలకు ఏటా రెండు పర్యాయాలు కలిపి సుమారు రూ.1.50 లక్షలు నిధులు మంజూరు చేస్తారు. అభివృద్ధి కమిటీ ఆమోదం మేరకు ఈ నిధులు వసతుల కల్పనకు వినియోగిస్తారు.

తాగునీటి వసతి లేదు.. వార్డులు అపరిశుభ్రం

వికారాబాద్‌లో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 23 ఉన్నాయి. జిల్లాలోని పలు ఆసుపత్రుల్లో సరిపడా మందులు అందుబాటలో లేక రోగులు అవస్థలు పడుతున్నారు. తాగునీటి వసతి సక్రమంగా లేదు. పలుచోట్ల ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు పనిచేయటం లేదు. ప్రధాన వార్డుల్లో పరిసరాలు అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి.

మందుల కొరత ఎక్కడా లేదు: డాక్టర్ పల్వన్‌కుమార్, జిల్లా వైద్యాధికారి, వికారాబాద్.

జిల్లాలో దాదాపుగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అభివృద్ధి కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల కారణంగా ఈ ఆరు నెలల పాటు కొన్నిచోట్ల సమావేశాలు జరగలేదు. ఏ ఆసుపత్రిలోనూ మందుల కొరత లేదు. రోగులకు అవసరమైనవి పూర్తి స్థాయిలో ఉన్నాయి.

జిల్లా వైద్య వ్యవస్థ స్వరూపం

జిల్లా ఆసుపత్రి: 1, సామాజిక ఆరోగ్య కేంద్రాలు: 3

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి: 1

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు: 23

బస్తీ దవాఖాలు: 4

అర్బన్ దవాఖానాలు: 2

# పట్టు పట్టాలి.. ప్రాజెక్టులు సాధించాలి

హైదరాబాద్: ప్రజారవాణాతోనే విశ్వనగర కీర్తి ముడిపడి ఉందని నమ్మిన పాలకులు, నగర అభివృద్ధి సంస్థలు అనేక ప్రణాళికలు చేశాయి. అందులో భాగంగానే మెట్రో రైలు అందుబాటులోకి వచ్చింది. నగరం నుంచి దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులను కోసం శివార్లలో మరిన్ని రైల్వే స్టేషన్లు అవసరమని భావించారు. నిజాంల కాలం నుంచి ఉన్న హైదరాబాద్, సికింద్రాబాద్, కాచిగూడకు తోడు.. నలువైపులా రైల్వే స్టేషన్లు నిర్మించాలని నిర్ణయించారు. తూర్పున చర్లపల్లి, పశ్చిమాన నాగులపల్లి, ఉత్తరాన మనోహరాబాద్, దక్షిణాన షాద్‌నగర్ స్టేషన్లను అభివృద్ధి చేస్తే.. ప్రయాణాలు సులభంగా సాగిపోతాయని భావించారు. కానీ వాటిని కార్యరూపం పెట్టడంలో విఫలమయ్యారు. ఇదే సరైన సమయం.. : హైదరాబాద్, చేవెళ్ల, మల్కాజిగిరి, సికింద్రాబాద్ ఎంపీ స్థానాలు నగర పరిధిలోకి వస్తాయి. ఈ నియోజకవర్గాల పరిధిలోనే 4 రైల్వే స్టేషన్లున్నాయి. నగర పరిధిలోకి మెదక్ ఎంపీ సీటు కూడా వస్తుంది. మొత్తం 5 మంది ఎంపీలు రాజధానితో ముడిపడి ఉన్నారు. వీరు మిగతా 3 స్టేషన్ల గురించి పట్టు పట్టాల్సిన అవసరముంది. నగరం నలువైపులా 4 స్టేషన్ల నిర్మాణానికిగాను ఒక్క చర్లపల్లిలోనే పనులు పూర్తయ్యాయి. మిగతావాటి ప్రతిపాదనలు రైల్వే బోర్డు వద్ద లేవు. ఈ నాలుగింటిని కలుపుతూ ఎంఎంటీఎస్ రైళ్లు పెంచే అంశంపై ఎంపీలు పట్టుపట్టాలి.

# ఉత్పత్తుల ధరల పెంపు

జగిత్యాల : కేంద్రప్రభుత్వం పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధరల(ఎంఎస్‌పీ)ను పెంచగా ప్రభుత్వరంగ సంస్థల సేకరణ, ప్రైవేటుగా ధరల అమలుతోనే అన్నదాతలకు ప్రయోజనం కలగనుంది. ఉమ్మడి జిల్లాలో ఈ వానాకాలంలో 8.50 లక్షల ఎకరాల విస్తీర్ణంతో వరి ప్రధాన పంటగా ఉండగా ప్రభుత్వం ఇన్నాళ్లూ ధాన్యం దొడ్డుగింజ రకాలను కొనుగోలు చేస్తుండగా వచ్చే సీజన్‌లో రూ.500 బోనస్‌తో సన్నగింజ రకాలను కొనుగోలు చేస్తామని ప్రకటించింది. కేంద్రం ధరపెంపు, రాష్ట్రప్రభుత్వ బోనస్‌ను కలుపుకొంటే జిల్లాలోని సాగు అంచనా, సరాసరి దిగుబడిని బట్టి దాదాపుగా రూ.360 కోట్లవరకు రైతులకు అదనపు ప్రయోజనం కలగనుంది.

ఉమ్మడి జిల్లాలో వరి తదుపరి పత్తి రెండో అత్యధిక విస్తీర్ణంలో 1.88 లక్షల ఎకరాల్లో సాగుచేస్తున్నారు. పత్తిలో సీసీఐ ద్వారా కేవలం 2-18 శాతం పంటనే కొనుగోలు చేస్తుండగా మిగిలిన దూదిని రైతులు మార్కెట్లు, గ్రామాల్లో ప్రైవేటు వ్యక్తులకు తక్కువ ధరకు విక్రయించి



నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్లో దూదికి ధర తగ్గితే సీసీఐ సేకరణ కేంద్రాల సంఖ్యను పెంచాల్సి ఉంది. కేంద్రం కోటా ఇవ్వలేదనే కారణంతో కందులను అత్యంత పరిమితంగానే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తుండటంతో రైతులందరికీ మద్దతుధర దక్కటంలేదు. మక్కలకు బయటి మార్కెట్లో ధర తగ్గితే మార్క్‌ఫెడ్ ద్వారా కొనాల్సి ఉంటుంది. వేరుసెనగ, సెనగలు, మినుములు, పెసలు, సోయాబీన్ తదితర ఉత్పత్తుల సేకరణనూ చేపట్టాల్సి ఉంటుంది. పసుపు పంటకు ఈ సీజన్‌లోనూ మద్దతు ధర ప్రకటించనందున విపణి ధరపైనే రైతులు ఆధారపడాల్సి ఉంటుంది. పదేళ్ల తరువాత ఇటీవల పసుపు పంటకు మంచి ధర లభించగా మున్ముందు ధర తగ్గితే పసుపును కూడా గతంలో మాదిరిగా మార్క్‌ఫెడ్ ద్వారా కొనాలని, గిట్టుబాటుగాని పంటలకు రాష్ట్రప్రభుత్వం బోనస్ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. వరికి క్వింటాలుకు రూ.117, మక్కలు రూ.135, పెసర రూ.124, పత్తి రూ.501 చొప్పున ధర పెంచగా విత్తనాలు, ఎరువులు, రసాయన మందుల ధరలు, కూలీలు, యంత్రాల ధరలు భారీగా పెరగటంతో పంటలకు పెంచిన ధరలు అంతగా లాభం కలిగించేలాలేవు. దీనికిగాను మార్కెట్‌లో మద్దతు కన్నా ధర తగ్గినపుడు ప్రభుత్వం మార్కెట్‌జోక్య పథకం ద్వారా పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తే రైతులకు మద్దతు ధరలతో కనీస మొత్తం చేతికంది ఆర్థిక ఆసరా కలుగుతుంది.

# ఇక సమాచార వేదిక..!

నల్గొండ :'రాష్ట్రంలో ప్రస్తుతం 110 కేంద్రాల్లోని రైతు వేదికల నుంచి వీడియో కాన్ఫరెన్సు కార్యక్రమాలు అందుబాటులో ఉన్నాయి. ఈ నెలఖరులోగా మరో456 వేదికల్లో ఈ సేవలను అందుబాటులోకి తీసుకొస్తాం..'అన్నదాతలు ఎప్పటికప్పుడు వ్యవసాయ సాగునకు సంబంధించి సలహాలు, సూచనలు దృశ్య శ్రవణ విధానంలో వీక్షిస్తూ తెలుసుకునేందుకు ప్రభుత్వం జిల్లాలో ఎంపిక చేసిన ఆరు కేంద్రాల్లో రైతునేస్తం పేరిట శిక్షణ, అవగాహన కార్యక్రమాలను ఈ ఏడాది మార్చి 6న ప్రారంభించింది. అప్పటి నుంచి ప్రతి మంగళవారం నిర్వహిస్తోంది. విత్తనం నుంచి మొదలుకుని పంటల సాగు వరకు జాగ్రత్తలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ఆయా పంటల సాగులో ఆచరించాల్సిన నీరు, ఎరువులు తదితర యాజమాన్య పద్ధతులు, యాంత్రీకరణ, వివిధ పంటలకు ఆశించే చీడపీడలు, వాటి నివారణ, సేంద్రియ వ్యవసాయ విధానాలు ఇలా పలు అంశాల్లో వారికి రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, పరిశోధన సంస్థల శాస్త్రవేత్తలు, నిపుణులతో ఆయా పంట కాలాల్లో అవగాహన, శిక్షణ అందిస్తున్నారు. అభ్యుదయ రైతుల అనుభవాలు, సేంద్రియ సాగు విధానాలు ప్రసారం చేస్తున్నారు. ఇప్పటికే నల్గొండ నియోజకవర్గంలోని తిప్పర్తి, సాగర్‌లో త్రిపురారం, నకిరేకల్ చందుపట్ల, దేవరకొండ, మిర్యాలగూడ, మునుగోడు రైతు వేదికల్లో ఎల్ఈడీ, వీడియో కెమెరాలు, స్టాండ్ సిస్టం తదితర సౌకర్యాలు కల్పించి వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాలుగా మార్చేసింది.




రైతులందరికీ అందుబాటులో లేవని..

కొన్ని కేంద్రాల్లో రైతునేస్తం దృశ్యశ్రవణం కార్యక్రమాలు జరగడం వల్ల రైతులందరికీ ఈ కార్యక్రమం అందుబాటులో ఉండటం లేదనే విమర్శలు వస్తున్నాయి. దీంతో రైతులు కూడా అంతగా హాజరవడం లేదు. ఈ వేసవిలోనూ అంతంత మాత్రంగానే హాజరు ఉంది. ప్రతి మండలంలోను కనీసం ఒక రైతు వేదికలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం అయింది. ఇక జిల్లా వ్యవసాయ శాఖ ప్రతి మండలంలో రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కొన్ని రైతు వేదికలను ఎంపిక చేసింది. ఈ నెలాఖరు వరకూ రాష్ట్రంలో పలు రైతు వేదికల్లో ఈ కార్యక్రమాన్ని అందుబాటులోకి తేగలమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ప్రకటించారు. దీంతో రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

ప్రతి మండలానికి రైతు నేస్తాం ఏర్పాటు..

పాల్వాయి శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి, నల్గొండ

ప్రతి మండలానికి ఒక రైతు వేదికను ఎంపిక చేసి రైతు నేస్తం సేవలను విస్తరిస్తే ఈ కార్యక్రమానికి రైతుల హాజరు పెరుగుతుంది. ఈ నెల చివరి నాటికి పరికరాలు బిగిస్తాం. రైతుల సంఖ్య పెరుగుతుంది. దీంతో రైతులకు సాంకేతిక సేవలు అందుబాటులోకి వస్తాయి.




# హస్తినలో సీఎం రేవంత్ బిజీ బిజీ..!!

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో ఉన్నారు. ఆయన వెంట మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క ఉన్నారు. వీరితో వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ జత కలువనున్నారు. ఆయన ఈ రోజు ఢిల్లీ వెళుతున్నారు. ముఖ్యనేతలంతా ఢిల్లీలో ఉండ టం ప్రాధాన్యం సంతరించుకుంది. త్వరలో మంత్రివర్గ విస్తరణ ఉంది. ఆ అంశంపై ఢిల్లీ పెద్దలతో సీఎం రేవంత్ రెడ్డి చర్చించే అవకాశం ఉంది. మంత్రి పదవి కోసం ఆశవాహులు చాలా మంది ఉన్నారు. ఇటీవల పార్టీలో చేరిన పోచారం శ్రీనివాస రెడ్డికి బెర్త్ ఖాయం అనే వార్తలు వినిపిస్తున్నాయి. సామాజిక సమీకరణాల ఆధారంగా ఎంపిక చేసే అవకాశం ఉంది.

**మంత్రివర్గ విస్తరణ..!! :** మంత్రివర్గ విస్తరణ, పార్టీలో చేరికల గురించి హైకమాండ్‌తో సీఎం రేవంత్ డిస్కష్ చేస్తారు. పోచారం శ్రీనివాస రెడ్డి, తర్వాత జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ చేరారు. 20 మంది వరకు పార్టీలో చేరతారని కాంగ్రెస్ నేత దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకుంది. దీంతోపాటు రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్ పదవి ఈ నెల 27వ తేదీతో ముగియనుంది. కొత్త పీసీసీ చీఫ్ నియమించాల్సి ఉంది. సీఎం పదవితోపాటు పీసీసీ చీఫ్ పదవి ఒకరికే ఇవ్వరు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రేవంత్.. పీసీసీ చీఫ్‌గా ఇన్నాళ్లూ కొనసాగారు. మరొకరికి పీసీసీ చీఫ్ పదవి ఇచ్చే ఛాన్స్ ఉంది.

**కేంద్రమంత్రులతో భేటీ..!! :** ఢిల్లీ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి పలువురు కేంద్రమంత్రులను కలిసే అవకాశం ఉంది. సీఎం రేవంత్ రెడ్డి కార్యాలయం కేంద్రమంత్రులను సమయం కోరిందని తెలిసింది. విభజన హామీల అమలు, ఇతర అంశాల గురించి కేంద్రమంత్రులతో ముఖ్యమంత్రి రేవంత్ చర్చించే అవకాశం ఉంది.

# జీవన్‌రెడ్డి తీవ్ర మనస్తాపం.. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా యోచన!



జగిత్యాల: ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరిక ఆ పార్టీలో చిచ్చురేపింది. ఎమ్మెల్సీ పదవికి కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి రాజీనామా చేసే యోచనలో ఉన్నారు. ఈ విషయంపై తన అనుచరులు, పార్టీ శ్రేణులతో చర్చలు జరుపుతున్నారు. భారాసకు చెందిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. తనకు సమాచారం లేకుండా ఆయన్ను పార్టీలో చేర్చుకోవడంపై జీవన్‌రెడ్డి తీవ్ర మనస్తాపం చెందారు. ఈ క్రమంలో ఆయన తన అనుచరులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు సమాచారం. జగిత్యాల నియోజకవర్గంలో 2014 నుంచి మూడు పర్యాయాలు సంజయ్, జీవన్‌రెడ్డి ప్రత్యర్థులుగా కొనసాగుతున్నారు. 2023 ఎన్నికల్లోనూ వీరిద్దరే పోటీపడ్డారు. ఈ నేపథ్యంలో తనకు తెలియకుండా సంజయ్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఆయన్ను బుజ్జగించేందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నేతలు జీవన్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. ఎలాంటి తొందరపాటు నిర్ణయం తీసుకోవద్దని వారు కోరినట్లు సమాచారం. 40 ఏళ్లు గౌరవప్రదంగా రాజకీయాలు చేశానని.. పార్టీకి రాజీనామా చేసి వ్యవసాయం చేసుకుంటానని సన్నిహితుల వద్ద జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

# పేపర్ లీక్‌పై ఈడీ విచారణకు ఎందుకు ఆదేశించ లేదు

హైదరాబాద్, జూన్ 24: నీట్ పేపర్ లీక్‌పై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని బీఆర్ఎస్ నేత బోయినపల్లి వినోద్‌కమార్ మోదీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లోనే నీట్ పేపర్ లీక్ అయిందని విమర్శించారు. ఈ పేపర్ లీక్ వ్యవహారంలో కోట్లాది రూపాయలు చేతులు మారినా ఈడీ దర్యాప్తునకు ఎందుకు ఆదేశించ లేదని ఆయన మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నీట్ పేపర్ లీక్ కారణంగా పీజీ ఎంట్రెన్స్ పరీక్షను కేంద్రం రద్దు చేసిందని.. అందువల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఈ మోదీ ప్రభుత్వం చెలగాటమాడిందని మండిపడ్డారు. అయితే ఈ పేపర్ లీక్ వ్యవహారంపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని ఆయన డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీక్‌పై స్పందించాలని ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడుకు ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. నీట్‌లో తాముండమని సుప్రీంకోర్టులో పిటిషన్



దాఖలు చేయాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి బోయినపల్లి వినోద్ కుమార్ సూచించారు. పేపర్ లీక్ చేస్తే ఉరిశిక్ష తరహాలో కఠిన శిక్షలు అమలు చేసేలా చట్టాలు తీసుకు రావాలని మోదీ ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. పేపర్ లీక్ వ్యవహారంలో మోదీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వినోద్ కుమార్ ఆరోపించారు.

# ఫిరాయింపు ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టుకు బీఆర్ఎస్

హైదరాబాద్: ప్రజల తీర్పుకు వ్యతిరేకంగా తమ పార్టీ వీడి కాంగ్రెస్లో చేరుతున్న ఎమ్మెల్యేల అనర్హత విషయంలో సుప్రీంకోర్టును ఆశ్రయించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. సుప్రీంకోర్టుకు వెళ్లేందుకు న్యాయ నిపుణులతో చర్చించింది. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు ప్రకారం మూడు నెలల్లో అనర్హత పిటిషన్ పైన స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని గులాబీ పార్టీ చెబుతోంది. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులోని పేరా నెంబర్ 30, 33 ప్రకారం హైకోర్టు వెంటనే నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని అంటోంది.

ఈనెల 27న హైకోర్టులో దానం నాగేందర్ అనర్హత అంశంపై విచారణ జరిగింది. ప్రస్తుతం దానం నాగేందర్‌తో పాటు పార్టీ మారిన ఎమ్మెల్యేల పైన ఒకేసారి సుప్రీంకోర్టుకు బీఆర్ఎస్ వెళ్లనుంది.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194



# హుస్నాబాద్‌లో జాబ్‌మేళాను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ : త్వరలో మండలాల వారీగా జాబ్‌మేళాలను ఏర్పాటు చేస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. యువజన సర్వీసుల శాఖ తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో హుస్నాబాద్‌లో నిర్వహిస్తున్న జాబ్ మేళా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..జీరో నుంచి పీజీ వరకు హుస్నాబాద్ నియోజవర్గం నుంచి ఆన్‌లైన్‌లో అప్లై చేసుకున్న వారు 6 వేల మంది ఉన్నారు. మీకు ఉన్న నైపుణ్యంతో కావాల్సిన ఉద్యోగంతో ఇక్కడి నుంచి వెళ్లాలన్నారు.

ఇవే కాకుండా విదేశాల్లో కూడా నర్సింగ్స్ నిర్మాణ రంగం, ఇతర రంగాల్లో లక్షల్లో జీతాలు వచ్చే ఉద్యోగాలు అలాంటి అవకాశాలను కూడా అందిపుచ్చుకోవాలని సూచించారు. అలాగే మండలాల వారీగా ఇలాంటివి ఏర్పాటు చేస్తే గ్రామీణ ప్రాంతాల వారికి కూడా ఉద్యోగ అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. ఇవే కాకుండా పాల ఉత్పత్తి, చేపల పెంపకం, గ్రామీణ పరిశ్రమలు కల్పించేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని గౌరవెల్లి ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేస్తామన్నారు.




హైదరాబాద్ : తెలంగాణ ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదలయ్యాయి. ఇంటర్ ఫస్టియర్‌లో 63.86 శాతం, వొకేషనల్‌లో 53.24 శాతం, సెకండియర్‌లో 43.77 శాతం, వొకేషనల్‌లో 51.12 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఫస్టియర్‌లో బాలికలు 70.26 శాతం ఉత్తీర్ణత సాధిచంగా, బాలుడు 58.39 శాతం సాధించారు. ఇంటర్ సెకండియర్‌లో 47.54 శాతం, బాలురు 41.37 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల కోసం https://tgbie.cgg.gov.in వెబ్‌సైట్‌ను క్లిక్ చేయొచ్చు. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు నిర్వహించిన సంగతి తెలిసిందే.

# 50ఏళ్ల క్రితం నాటి పొరబాటు మళ్లీ జరగొద్దు: 'ఎమర్జెన్సీ'పై మోదీ కీలక వ్యాఖ్యలు



దిల్లీ: 18వ లోక్‌సభ తొలి సమావేశాలకు ముందు ప్రధానమంత్రి నరేంద్రమోదీ మీడియాతో మాట్లాడారు. ఇదో అద్భుతమైన రోజు అంటూ కొత్తగా ఎన్నికైన సభ్యులకు స్వాగతం పలికారు. సభ్యులందరినీ కలుపుకొని వికసిత భారత్ లక్ష్యాన్ని చేరుకుంటామని విశ్వాసం వ్యక్తంచేశారు. ఈ ఉదయం పార్లమెంట్‌కు చేరుకున్న ప్రధాని మోదీకి కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాని మాట్లాడుతూ.. "ఈ ప్రజాస్వామ్య పార్లమెంటరీ చరిత్రలో ఇదో అద్భుతమైన రోజు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారిగా లోక్‌సభ ఎంపీల ప్రమాణస్వీకారం మన కొత్త పార్లమెంట్ భవనంలో జరగనుంది. ఈ శుభ సమయాన కొత్తగా ఎన్నికైన సభ్యులకు స్వాగతాభినందనలు తెలియజేస్తున్నా. ప్రజలు మా విధానాలను విశ్వసించారు. దేశానికి మూడోసారి సేవ చేసే భాగ్యాన్ని ప్రజలు కల్పించారు. సరికొత్త విశ్వాసంతో నేడు కొత్త సమావేశాలు ప్రారంభిస్తున్నాం. రాజ్యాంగానికి గౌరవం ఇచ్చి నిర్ణయాలు తీసుకుంటాం. ప్రజల స్వప్నం నెరవేర్చే సంకల్పం తీసుకున్నాం. సభ్యులందరినీ కలుపుకొని 2047 వికసిత భారత్ సంకల్పం. ఆ లక్ష్యాన్ని నెరవేర్చే దిశగా సాగుతాం. కొత్త లక్ష్యాలు నిర్దేశించుకుని మనమంతా ముందుకెళ్దాం" అని ఎంపీలకు పిలుపునిచ్చారు.

**ఎమర్జెన్సీ ఓ మచ్చ..**"అత్యయిక స్థితి ఏర్పడి రేపటికి 50 ఏళ్లు పూర్తవుతాయి. దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఎమర్జెన్సీ ఓ మచ్చలా మిగిలిపోయింది. 50ఏళ్ల క్రితం జరిగిన పొరపాటు పునరావృతం కాకూడదు" అని మోదీ అన్నారు. ఈ సందర్భంగా విపక్ష ఎంపీలకు చురకలంటించారు. "ఈ దేశానికి మంచి, బాధ్యతాయుతమైన విపక్షం అవసరం. ప్రజాస్వామ్య మర్యాదను కాపాడేలా, సామాన్య పౌరుల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతిపక్షాలు నడుచుకుంటాయని ఆశిస్తున్నా. డ్రామాలు, ఆటంకాలను ప్రజలు కోరుకోవట్లేదు. నినాదాలు ఆశించట్లేదు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు విపక్షాలు కూడా సహకరించాలి" అని ప్రధాని హితవు పలికారు.

# ఫిరాయింపులపై బీఆర్ఎస్ మాట్లాడుతుంటే నవ్వు వస్తోంది: షబ్బీర్ అలీ




హైదరాబాద్: పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతుంటే నవ్వు వస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో మీడియతో మాట్లాడుతూ.. భట్టి విక్రమార్కకు ప్రతిపక్ష నేత హోదా లేకుండా చేసింది కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. శాసనమండలిలో కూడా తన ప్రతిపక్ష నేత హోదా తొలగించలేదా? అని నిలదీశారు. తమ పార్టీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను బీఆర్ఎస్‌లో చేర్చుకోలేదా? అని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో 8 సీట్లలో డిపాజిట్ పోయిందని, ఇప్పుడు అనర్హత వేటు గురించి మట్లాడుతున్నారని షబ్బీర్ అలీ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఖతం అయ్యిందని, 11 ఎకరాలు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం కోసం ఎందుకు?.. ఆ భూమిని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని షబ్బీర్ అలీ అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఇప్పటి వరకు ఆఫీస్ లేదని, కొకపేటలో బీఆర్ఎస్ పార్టీకి ఇచ్చిన భూములు వెనక్కి తీసుకోవాలని సూచించారు. ఆ భూమి వేలం వేసి ఆ డబ్బులు రుణమాఫీకి ఉపయోగించాలని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఇప్పుడున్న ఆఫీస్ ఎక్కువని.. దానికి కూడా తామే భూమి ఇచ్చామని గుర్తు చేశారు. తెలంగాణని కేసీఆర్ అంగడి బజారులో పెట్టారని, తెలంగాణని అమ్మకానికి పెట్టారంటూ కేసీఆర్‌పై షబ్బీర్ అలీ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

# సంజయ్ కాంగ్రెస్‌లో చేరడం అనైతికం

హైదరాబాద్: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కాంగ్రెస్ పార్టీలో చేరడం పెద్ద ఎత్తున రచ్చకు కారణమవుతోంది. సంజయ్ చేరికపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఆందోళనలకు దిగాయి. అధిష్టానంపై ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఆయనను ప్రభుత్వ విప్పులు ఆది శ్రీనివాస్, లక్ష్మణ్ బుజ్జగిస్తున్నారు. మరోవైపు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ రాజీనామా చేయాలని బీఆర్ఎస్ నేత కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌లో సంజయ్ చేరికపై ఎమ్మెల్సీ ఎల్ రమణ స్పందించారు.

ఆయన కాంగ్రెస్‌లో చేరడం అనైతికమని అన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడేలా చట్టం తెస్తామని రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారంలో చెప్పారని ఎల్ రమణ అన్నారు. కాంగ్రెస్ పార్టీలో రాహుల్ గాంధీ మాటకు విలువ లేదా? అని ప్రశ్నించారు. తెలంగాణలో ఉన్నది రేవంత్ కాంగ్రెస్ పార్టీనా? లేక ఇందిరా కాంగ్రెసా? అని నిలదీశారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు స్వయంగా సీఎం రేవంత్ కండువా కప్పుతున్నారని.. ఇది నీతి మాలిన చర్య అని పేర్కొన్నారు. దీనికి రాహుల్ గాంధీ ఏం సమాధానం చెబుతారని రమణ ప్రశ్నించారు. చేనేత కార్మికుల ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలేనన్నారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో చేనేతల ఆత్మహత్యల పై చర్చ జరగాలని ఎల్ రమణ డిమాండ్ చేశారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660